**Note :** జీవవైవిధ్యంపైన రాష్ట్ర జీవవైవిధ్య మండలి ప్రతి జిల్లాలో మరియు వివిధ గ్రామ పంచాయతి పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. అలాగే "జీవవైవిధ్య యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున జీవవైవిధ్యం గురించి కాని కమిటీల ఏర్పాటు గురించి కాని మరియు ఇతర సలహాలు కావాలనుకున్న రాష్ట్ర జీవవైవిధ్య మండలిని సంప్రదించవచ్చును. అలాగే మా యొక్క వెబ్‌సైట్ సందర్శించి ఇతర విషయాలు సంపూర్ణంగా తెలుసుకోవాలని ఆశిస్తున్నాము.



## తెలంగాణ రాష్ట్ర జీవవైవిధ్య మండలి


6వ అంతస్తు, చంద్రవిహార్, ఎం.జె. మార్కెట్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్-500 001.
ఫోన్: 040-24602345.
ఈమెయిల్: telanganabiodiversity@gmail.com | www.tsbiodiversity.org


# తెలంగాణ రాష్ట్ర జీవవైవిధ్య మండలి

### తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్

## జీవవైవిధ్య యాజమాన్య కమిటీల ఏర్పాటుపై అవగాహనా కరపత్రం

జీవవైవిధ్యం అనగా, పర్యావరణంతో సహా ప్రకృతిలోని జీవరాసులన్నీ కలసి జీవవైవిధ్యం. ప్రకృతిలో 84 లక్షల జీవరాసులున్నట్లుగా వేదాలు చెబుతున్నాయి. కానీ ప్రస్తుతం కేవలం 20 లక్షల జీవరాసులు మాత్రమే జీవించి వున్నాయని ఒక అంచనా సమాచారం. కారణం, వాతావరణ కాలుష్యం వలన ప్రకృతిలో జీవరాసుల మధ్య సమతుల్యత లోపిస్తున్నది. ఈ కారణంగా జీవవైవిధ్య సంరక్షణ ఎంతో ప్రాముఖ్యతను కలిగియున్నది.

అందువలన జీవావరణ వైవిధ్యత సంరక్షణ కోసం ఒక అంతర్జాతీయ ఒడంబడిక చేయుట జరిగినది. ఒడంబడిక, ముఖ్యంగా మూడు ఉద్దేశ్యాలను ఉద్ఘాటిస్తున్నది. అవేవంటే, 1) జీవవైవిధ్య సంరక్షణ, 2) జీవవనరుల సుస్థిర వినియోగం, 3) జీవావరణ వనరుల వినియోగం ద్వారా సమకూడిన ప్రయోజనాల న్యాయోచిత లాభాల పంపకం.

ఈ ఒడంబడికకు భారతదేశంతో సహా 194 దేశాలు ఆమోదం తెలిపాయి. ఒడంబడికపై సంతకం చేసిన దేశంగా భారతదేశం దాని ఉద్దేశ్యాలను సాధించటానికి సమగ్ర చట్టాన్ని చేయాల్సిన అవసరం ఉంది. ఆ విధంగా, 2002లో భారతదేశం జీవవైవిధ్య చట్టాన్ని చేసింది.

భారత ప్రభుత్వం 2002 జీవవైవిధ్య చట్టాన్ని 2003 ఫిబ్రవరి 5వ తేదీన ప్రకటించింది. ఈ చట్టం యావత్ భారత దేశానికి వర్తింపచేస్తూ తన జీవన వనరులపై దేశం యొక్క సార్వభౌమాధికార హక్కులను పునరుద్ఘాటించింది. దరిమిలా, భారత ప్రభుత్వం 2004 ఏప్రిల్ 15వ తేదీన జీవవైవిధ్య నియమావళిని జారీ చేసింది. ఈ నియమావళి ననుసరించి, ప్రతి స్థానిక సంస్థ, తన అధికార పరిధిలోపు ఒక జీవవైవిధ్య యాజమాన్య కమిటి (బి.యం.సి) ని ఏర్పాటు చేయాలని ఉద్ఘాటించింది. 2015లో భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర జీవవైవిధ్య నియమావళిని రూపొందించింది. అందులో జీవవైవిధ్య యాజమాన్య కమిటి ఏర్పాటు గురించి స్పష్టపరిచింది.

జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్.బి.ఏ) అత్యున్నత సంస్థ, చెన్నైలో గల దాని ప్రధాన కార్యస్థానం ద్వారాను, ప్రతీ రాష్ట్రం దాని వ్యక్తిగత రాష్ట్ర జీవవైవిధ్య మండలి (ఎస్.బి.బి) తోను, ప్రతి స్థానిక సంస్థ ఒక జీవవైవిధ్య యాజమాన్య కమిటీతోను, ఆ అంశాలను అమలు పర్చటానికి మూడు అంచెల వ్యవస్థను జీవవైవిధ్య చట్టం ఉద్దేశిస్తున్నది. బి.ఎం.సి.లను జిల్లా పరిషత్ స్థాయిలోను, మండల పరిషత్ స్థాయిలోను, గ్రామ పంచాయతీ స్థాయిలోను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. పట్టణాలు, నగరాలలో మునిసిపల్ కార్పోరేషన్ స్థాయి, మునిసిపాలిటి స్థాయిలో ఏర్పాటు చేయవలసి ఉంటుంది.












Photo Courtesy : Hyderabad Birding Pals & G. Sailu

Dsgn & Printed at : GAYATRI graphic point

# జీవవైవిధ్య మండలి - జీవవైవిధ్యం - పరిరక్షణ - అవగాహన

జీవవైవిధ్యం అనగా, పర్యావరణంతో సహా ప్రకృతిలోని జీవరాసులన్నీ కలసి ఉన్న విధానాన్నే జీవవైవిధ్యం అంటారు. జీవవైవిధ్యం ప్రకృతి ఇచ్చిన వరం. మానవుని మనుగడకు ఆధారం. దానిని కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యం. ప్రకృతి మనకు అన్నింటిని సమకూరుస్తుంది. మనం ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. ప్రకృతి రక్షితో రక్షితః

ప్రకృతిలో ఎన్నో జీవరాశులు, సూక్ష్మజీవులు, బాక్టీరియా, మొదలు పులి, ఏనుగులు, సింహాలు, నదులు, సముద్రాలలోని చిన్న చేపలు మొదలు పెద్ద షార్కులు, తిమింగలాలు వరకూ చిన్న గడ్డి మొక్కల నుండి పెద్ద వృక్షాల వరకూ, దాదాపుగా 84 లక్షల జీవరాశులతో ఎంతోవైవిధ్యం, జీవవైవిధ్యం, కాని మనకు తెలిసినవి 20 లక్షల జీవరాశులు మాత్రమే.

ఆకు పచ్చని చెట్లు, అరణ్యాలు, అందమైన పూలు, పూల మొక్కలు పండ్లు, మొక్కలు, రంగు రంగుల పక్షులు, సీతాకోక చిలుకలు, సంగీతాన్నందించే కోయిలలు, కందిరీగలు, తేనెటీగలు, రకరకాల పక్షులు, రకరకాల జంతువులు, పంటచేలు వీటిలోని జాతులు ప్రజాతులు, ఎంతో అందమైన జీవవైవిధ్యం, కంటికి ఆహ్లాదం, మనసుకు ఆనందం జీవవైవిధ్యమే ప్రకృతి విజయ రహస్యం.

ప్రకృతిలోని సమస్త జీవజంతు జాలంలో అతి తెలివైన ప్రాణి మానవుడు. తన తెలివి తేటలతో ప్రకృతిని శాసించాడు. తన అవసరాలకు ప్రకృతిని కొల్లగొట్టాడు. తాను తన ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో, ఎన్నో లక్షల సంవత్సరాల నుండి పరిణామ క్రమంలో ఏర్పడిన జీవరాసులు, మొక్కలు వాటి వైవిధ్యం చాలా భాగం అంతరించే దశలో ఉన్నాయంటే అతిశయోక్తికాదు.

ఎంతో సాధించామని చెప్పకొంటున్న మన శాస్త్రీయ విజ్ఞానం మందితో పాటు చెడుకు కూడా బాగా ఉపయోగపడిందని చెప్పటలో ఏ మాత్రం సంశయము లేదు. నేడు ప్రతి 10 నిమిషాలకు ఒక జీవ జాతి అంతరించిపోతున్నది. ఒక సారి అంతరించిపోతే జీవరాశులు మళ్ళీ పుట్టవు.

మనం చెప్పకుంటున్న నాగరికత, పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో అడువులు నాశనమవుతున్నాయి. మానవుని మనుగడకు జీవావరణమునకు ప్రపంచంలో కనీసం 33 శాతం అడవులుండాలి. అయితే ప్రతి రోజు భూమి మీద కొన్ని వేల హెక్టార్ల అడవులు నాశనం చేయబడుచున్నాయి. అనేక జంతు, జీవ, మొక్కల ఆవాసానికి ప్రమాదం తెచ్చిపెడుతున్నాయి. అనేక రకాల జంతువులు మొత్తంగా అంతరించే దశకు చేరుకొంటున్నాయి.

అడవుల వలన మనకు ఎంత ఉపయోగమున్నదో మన అందరికి తెలిసిన విషయమే, ముఖ్యంగా, వాతావరణంలోని కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహించి ప్రాణ వాయువైన ఆక్సీజన్‌ను విడుదల చేస్తాయి. వాతావరణాన్ని వేడి నుండి కాపాడుతాయి. వర్షాలను కురిపిస్తాయి. వరదలను నిరోధిస్తాయి. మానవునికి కావలసిన ఎన్నో అవసరాలను తీరుస్తాయి. మన దేశంలోని అడవులు ఎంతో జీవవైవిధ్యానికి పెట్టింది పేరు. అందువలన, జీవవైవిధ్యాన్ని అంతరించకుండా పరిరక్షించవలసిన బాధ్యత మన అందరిపై ఉన్నది.



**జీవవైవిధ్యం - ఎలా కాపాడాలి?** భూమిని, భూమిపై ఉన్న సమస్త ప్రాణులను గౌరవించాలి. అన్ని జీవిజాతులు ఒక దానిపై మరొకటి ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ప్రతి జీవికి విలువ ఉంది. మనుషులకు ఉపయోగపడవచ్చు. పడకపోవచ్చు. ప్రకృతి అన్ని జీవులకు సమానం అని మహాత్మాగాంధీ జీవవైవిధ్యం గురించి సెలవిచ్చారు.

జీవవైవిధ్యం కాపాడుట ప్రపంచంలో ప్రతి ఒక్కరి బాధ్యత. అన్ని దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రత్యేక ఆర్థిక వనరులు సమకూర్చవలసి ఉంది. వాతావరణం, పర్యావరణం, జీవవైవిధ్యం వేరు వేరు కాదు. ఒకదానిపై ఒకటి ఆధారం, సమస్త జీవరాసులకు జీవించే హక్కు ఉన్నది. కావున వాటి ఆవాసాలు అభివృద్ధి పరచాలి. అనేక రకాల కాలుష్య, నియంత్రణ, మానవుని విలాసాలు కూడా నియంత్రించవలసి వుంటుంది. ప్రకృతిని రక్షించితే అది మనల్ని రక్షిస్తుంది. లేనిచో మానవుని మనుగడే ప్రమాదం.

## జీవవైవిధ్య - పరిరక్షణా మార్గాలు :

- జంతువుల, పక్షుల ఆవాసాల పరిరక్షణ చేయుట
- అడవుల, అభయారణ్యాల పరిరక్షణ చేయుట
- సామాజిక అడవుల పెంపకం చేయుట
- సేంద్రియ వ్యవసాయం - రసాయన ఎరువులు మందులు వాడకంలో నియంత్రణ పాటించుట
- జంతువులు, పక్షుల వేటపై నిషేదం పాటించుట
- గో సంరక్షణ సంస్థలను ప్రోత్సహించుట
- ప్లాస్టిక్ వాడకంపై నియంత్రణ పాటించుట
- పారిశ్రామిక విసర్జాలను రీసైక్లింగ్ మరియు నియంత్రణ చేయుట
- భూమిలో ఖనిజాల త్రవ్వకాలను నియంత్రించుట
- నీటి వాడుకలో పొదుపు పాటించుట
- వాన నీటిని ఒడిసిపెట్టి సద్వినియోగపరుచుకొనుట
- అడవుల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసి ఎండాకాలంలో జంతువుల దప్పిక తీర్చుట
- పంటల వైవిధ్యాన్ని కాపాడుటకు జన్యు బ్యాంకులు, విత్తన బ్యాంకులు ఏర్పాటు చేయుట
- జీవవైవిధ్యం, అడవుల పరిరక్షణలో స్థానికులందరినీ భాగస్వాములు చేయుట
- జీవవైవిధ్యం పరిరక్షణకు నిధులను సమకూర్చుకొనుట.







